జూలై - సెప్టెంబరు 2015

# కావలికోట

మెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది



## లోకాంతం దగ్గర్లో ఉందా?

# కావలికోట

యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది

July–September 2015
Vol. 136, No. 13 TELUGU

Monthly and Supplemental quarterly editions


కావలికోట అనే ఈ పత్రిక, విశ్వ పరిపాలకుడైన యెహోవా దేవుణ్ణి ఘనపరుస్తుంది. పరలోకంలో పరిపాలిస్తున్న దేవుని రాజ్యం త్వరలో చెడుతనాన్ని పూర్తిగా తీసివేసి, భూమిని సుందరమైన ఉద్యానవనంలా మారుస్తుందనే మంచివార్త చెబుతూ ఇది ప్రజలకు ఊరటనిస్తుంది. మనం నిరంతరం జీవించడం కోసం తన ప్రాణాన్ని అర్పించి, ప్రస్తుతం దేవుని రాజ్యాన్ని పరిపాలిస్తున్న యేసుక్రీస్తు మీద విశ్వాసం ఉంచమని ప్రోత్సహిస్తుంది. 1879 నుండి క్రమం తప్పకుండా ప్రచురితమౌతున్న ఈ పత్రికకు రాజకీయాలతో ఎలాంటి సంబంధమూ లేదు. దీనికి బైబిలే ఆధారం.

మీకు ఇంకా ఎక్కువ తెలుసుకోవాలనుందా? మీ ఇంట్లోనే ఉచితంగా బైబిలు గురించి నేర్చుకోవాలనుందా?

అయితే www.jw.org/te వెబ్‌సైట్‌ని సందర్శించండి లేదా ఈ కింది చిరునామాకు రాయండి.


INDIA:
Jehovah's Witnesses
Post Box No. 6440, Yelahanka
Bangalore 560 064, KAR.


ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని చిరునామాల కోసం www.jw.org/contact చూడండి.

ఈ ప్రచురణ అమ్మకానికి కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న బైబిలు విద్యాపనిలో భాగంగా స్వచ్ఛంద విరాళాల సహాయంతో ప్రచురించబడుతోంది. ప్రత్యేకంగా సూచించబడని లేఖనాలు పరిశుద్ధ *గ్రంథము* నుండి ఉల్లేఖించబడ్డాయి. కొన్ని లేఖనాల్లో విషయాన్ని నొక్కి చెప్పడానికి ***ఏటవాలుగావున్న ముద్దక్షరాలు*** ఉపయోగించబడ్డాయి. లేఖనం ఉన్నచోట *NW* అని ఉంటే అది ఆధునిక ఇంగ్లీషు భాషలోని పరిశుద్ధ లేఖనముల నూతనలోక అనువాదము నుండి అనువదించబడిందని అర్థం.


Published and Printed by The Watch Tower Bible and Tract Society of India at 927/1 Addevishwanathapura, Rajanukunte, Bangalore 561 203, Karnataka. మీ ఉత్తరాలను ఈ చిరునామాకు పంపించండి: Post Box No. 6441, Yelahanka, Bangalore 560 064, Karnataka.


© 2015 Watch Tower Bible and Tract Society of Pennsylvania. Printed in India.



ప్రతీ సంచిక ముద్రణ:
5,29,46,000 ప్రతులు, 240 భాషల్లో

**జూలై - సెప్టెంబరు 2015**


## పత్రిక ముఖ్యాంశం


**లోకాంతం దగ్గర్లో ఉందా? 3-8 పేజీలు**

"లోకాంతం" అంటే ఏంటి? 3

లోకాంతం దగ్గర్లో ఉందా? 6

అంతాన్ని చాలామంది తప్పించుకుంటారు—మీరూ తప్పించుకోవచ్చు 8


## ఇంకా ఈ పత్రికలో


మీకిది తెలుసా? 9

బైబిలు జీవితాలను మారుస్తుంది
యెహోవా దయ చూపించే, క్షమించే దేవుడని తెలుసుకున్నాను 10

వారి విశ్వాసాన్ని అనుసరించండి
"నేను దేవుని స్థానమందున్నానా?" 12

మీరు ఎప్పుడైనా ఆలోచించారా? 16


JW.ORG™ ఇంటర్నెట్‌లో మరిన్ని ఆర్టికల్స్ చదవండి




ఇంటర్నెట్‌లో వేర్వేరు ఫార్మాట్‌లలో ఈ పత్రికను డౌన్‌లోడ్ చేసుకోండి



మరికొన్ని ప్రశ్నలకు బైబిలు ఇచ్చే జవాబులు

దేవుని ప్రభుత్వం ఏమి చేస్తుంది?

(బైబిలు బోధలు > బైబిలు ప్రశ్నలకు జవాబులు చూడండి)



# “లోకాంతం” అంటే ఏంటి?

“అంతం దగ్గరపడింది” అనే మాట మీరెప్పుడైనా విన్నారా? ఖచ్చితంగా వినే ఉంటారు. రోజురోజుకి ఘోరంగా తయారౌతున్న లోక పరిస్థితులను చూసినప్పుడు చాలామంది అలానే అంటారు. టీవీలో, వార్తాపత్రికల్లో ఫలానా రోజు అంతం వస్తుందనే వార్తలు చాలాసార్లు వినే ఉంటారు. లోకం ఎలా అంతమౌతుందని మీకనిపిస్తుంది? ప్రకృతి విపత్తుల వల్లనా లేక మూడవ ప్రపంచ యుద్ధం వల్లనా? అంతం వచ్చినప్పుడు భూమ్మీద మనుషులు తుడిచిపెట్టుకుపోతారని మీకనిపిస్తుందా? ఇలాంటివన్నీ ఊహించుకున్నప్పుడు కొంతమంది భయపడతారు, కొంతమంది నమ్మరు, కొంతమందికైతే అంతం అంటే పెద్ద జోక్‌లా అనిపిస్తుంది.

దేవుని వాక్యం “అంతము వచ్చును” అని చెప్తుంది. (మత్తయి 24:14) దేవుని వాక్యం అంతాన్ని “దేవుని మహాదినము,” “హార్‌మెగిద్దోను” అని కూడా పిలుస్తుంది. (ప్రకటన 16:14-16) ఈ విషయం గురించి రకరకాల మతాలు రకరకాలుగా చెప్తున్నాయి. అంతం గురించిన ఊహాగానాలు విచిత్రంగా, భయం కలిగించేలా ఉన్నాయి. అయితే, అంతం అంటే ఏంటి, ఏది కాదు? అంతం దగ్గర్లో ఉందా, లేదా? అన్నిటికన్నా ముఖ్యంగా, అంతం వచ్చినప్పుడు ప్రాణాలతో ఎలా బయటపడవచ్చు? అనే ప్రశ్నలకు దేవుని వాక్యంలో స్పష్టమైన జవాబులు ఉన్నాయి. ముందుగా అంతం గురించిన అపోహలు తీసేసుకుని, నిజానికి అంతం అంటే ఏమిటో చూద్దాం. అసలు అంతం అంటే ఏమిటని దేవుడు చెప్తున్నాడు?

## అంతం అంటే ఇది కాదు . . .

### 1. అంతం అంటే అగ్ని వచ్చి భూమి కాలిపోయి, నాశనమవడం కాదు.

“భూమి యెన్నటికిని కదలకుండునట్లు ఆయన దానిని పునాదులమీద స్థిరపరచెను” అని దేవుని వాక్యంలో ఉంది. (కీర్తన 104:5) దేవుడు భూమిని నాశనం చేయడని, అలా జరగనివ్వడని ఈ మాట, దేవుని వాక్యంలో ఉన్న వేరే మాటలు మనకు భరోసా ఇస్తున్నాయి.—ప్రసంగి 1:4; యెషయా 45:18.

### 2. అంతం సమయం, తేది లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు వచ్చేది కాదు.

అంతానికి ఖచ్చితమైన సమయం ***ఉందని,*** దాన్ని దేవుడు నిర్ణయించాడని ఆయన వాక్యంలో ఉంది. “ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. జాగ్రత్తపడుడి; మెలకువగానుండి ప్రార్థన చేయుడి; ఆ కాలమెప్పుడు వచ్చునో మీకు తెలియదు.” (మార్కు 13:32, 33) కాబట్టి, అంతం ఎప్పుడు వస్తుందనే విషయంలో దేవుడు (“తండ్రి”) ఒక ఖచ్చితమైన ‘కాలాన్ని’ నిర్ణయించాడని అర్థమౌతుంది.

### 3. అంతం మనుషుల వల్ల, ఆకాశం నుండి పడే ఉల్కల వల్ల వచ్చేది కాదు.

అంతం దేని వల్ల వస్తుంది? ప్రకటన పుస్తకం 19:11లో “పరలోకము తెరువబడియుండుట చూచితిని. అప్పుడిదిగో, తెల్లని గుఱ్ఱమొకటి కనబడెను. దానిమీద కూర్చుండియున్నవాడు నమ్మకమైనవాడును సత్యవంతుడును అను నామము గలవాడు” అని ఉంది, తర్వాత 19వ వచనంలో ఇలా ఉంది: “మరియు ఆ గుఱ్ఱముమీద కూర్చున్నవానితోను ఆయన సేనతోను యుద్ధముచేయుటకై ఆ క్రూరమృగమును భూరాజులును వారి సేనలును కూడియుండగా చూచితిని.” (ప్రకటన 19:11-21) ఇక్కడ ఇచ్చిన వర్ణన వెంటనే మనకు అర్థంకాకపోయినా ఒక విషయమైతే స్పష్టమౌతుంది: దేవుడు దేవదూతల సైన్యాన్ని పంపించి తన శత్రువులను నాశనం చేస్తాడు.

## అంతం అంటే ఏంటి?

### 1. ఏమీ చేయలేకపోతున్న మానవ ప్రభుత్వాల అంతం.

“పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము [ప్రభుత్వం] స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము

అంతం గురించి దేవుడు చెప్తున్నది మంచివార్తే కాని చెడువార్త కాదు



దాని పొందినవారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగముల వరకు నిలుచును” అని దేవుని వాక్యంలో ఉంది. (దానియేలు 2:44) ఇంతకుముందు 3వ అంశంలో చూసినట్టు “గుఱ్ఱముమీద కూర్చున్నవానితోను ఆయన సేనతోను యుద్ధము” చేయడానికి వచ్చిన “భూరాజులును వారి సేనలు” నాశనం అవుతాయి.—ప్రకటన 19:19.

## 2. యుద్ధం, హింస, అన్యాయానికి అంతం.

“[దేవుడు] భూదిగంతములవరకు యుద్ధములు మాన్పువాడు.” (కీర్తన 46:9) “యథార్థవంతులు దేశమందు నివసించుదురు లోపములేనివారు దానిలో నిలిచియుందురు. భక్తిహీనులు దేశములో నుండకుండ నిర్మూలమగుదురు. విశ్వాసఘాతకులు దానిలోనుండి పెరికివేయబడుదురు.” (సామెతలు 2:21, 22) “ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నాను” అని దేవుడు అంటున్నాడు.—ప్రకటన 21:4, 5.

## 3. దేవున్ని, మనుషులను మోసం చేసిన మతాల అంతం.

“ప్రవక్తలు పరవశులై అబద్ధాలు పలుకుతారు. యాజులు [యాజకులు] సొంత అధికారంతో పెత్తనం చెలాయిస్తారు . . . అయితే అంతం వచ్చినప్పుడు మీరు ఏమి చేస్తారు?” (యిర్మీయా 5:31, *పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) “ఆ దినమందు అనేకులు నన్ను చూచి—ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు—నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయు వారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును.”—మత్తయి 7:21-23.

## 4. ఇప్పుడున్న లోక పరిస్థితులకు మద్దతునిస్తూ నడిపిస్తున్న మనుషుల అంతం.

యేసు క్రీస్తు ఇలా అన్నాడు: “ఆ తీర్పు ఇదే; వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి.” (యోహాను 3:19) పూర్వం నోవహు అనే ఒక మంచి మనిషి జీవించిన కాలంలో కూడా భూవ్యాప్తంగా జరిగిన ఒక నాశనం గురించి బైబిలు వివరిస్తుంది. “అప్పుడున్న లోకము నీటివరదలో మునిగి నశించెను. అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినము వరకు అగ్నికొరకు నిలువచేయబడినవై, అదే వాక్యమువలన భద్రము చేయబడియున్నవి.”—2 పేతురు 3:5-7.

‘తీర్పు, నాశనము జరిగే దినాన్ని’ నోవహు జీవించి నప్పటి ‘లోకంతో’ పోల్చారు. ఆ లోకం నాశనమైందా? భూగ్రహం నాశనం కాలేదు కానీ చెడ్డవాళ్లు అంటే దేవుని శత్రువులు నాశనం అయ్యారు. దేవుని శత్రువులుగా ఉండాలని నిర్ణయించుకున్న వాళ్లు కూడా భవిష్యత్తులో జరగబోయే దేవుని ‘తీర్పు దినమున’ నాశనం అవుతారు. కానీ నోవహు, ఆయన కుటుంబంలాగే దేవున్ని ఇష్టపడేవాళ్లు బ్రతుకుతారు. —మత్తయి 24:37-42.

చెడును, చెడు ప్రభావాలను దేవుడు తీసేసినప్పుడు ఈ భూమి ఎంత అద్భుతంగా ఉంటుందో ఊహించుకోండి! అంతం గురించి దేవుడు చెప్తున్నది మంచివార్తే కాని చెడు వార్త కాదు. అయితే ఇప్పుడు, మీరు ఇలా ఆలోచిస్తుండవచ్చు: అంతం ఎప్పుడు వస్తుందని దేవుడు చెప్తున్నాడు? అది దగ్గర్లోనే ఉందా? అంతం వచ్చినప్పుడు మనం ఎలా తప్పించుకోవచ్చు? (*w15*-E 05/01)

**అంతం తర్వాత . . .** అంతం తర్వాత జీవితం ఎలా ఉంటుంది? ఆ సమయం గురించి వివరించే ఎన్నో మాటలు దేవుని వాక్యంలో ఉన్నాయి. ఉదాహరణకు, “[దేవుడు] వారి కన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచివేయును, మరణము ఇక ఉండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు, మొదటి సంగతులు గతించిపోయెను. అప్పుడు సింహాసనాసీనుడైయున్నవాడు—ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని చెప్పెను.” (ప్రకటన 21:4, 5) అంతం అంటే భూమ్మీద ప్రతీ ఒక్కరు చనిపోతారని కాదు. మనం ప్రాణాలతో ఉండాలని దేవుడు కోరుకుంటున్నాడు, అంతం ఎలా తప్పించుకోవచ్చో కూడా ఆయన చెబుతున్నాడు.

# లోకాంతం దగ్గర్లో ఉందా?

మనుషులు ఒకరి మీద ఒకరు అధికారం చెలాయించుకుంటూ, భవిష్యత్తును చీకటిమయం చేసుకుంటుంటే దేవుడు చూస్తూ ఊరుకుంటాడా? లేదు. మనం ఇంతకుముందు చూసినట్లు, దేవుడు జోక్యం చేసుకుని తరతరాలుగా కొనసాగుతున్న బాధను, అణచివేతను తీసేస్తాడు. అందుకు సమయం దగ్గర పడిందని ఈ భూమిని, మానవుల్ని చేసిన దేవుడు మనకు చెప్తున్నాడు. ఎలా?

దీని గురించి ఆలోచించండి: మీరు కొత్త ఊరికి ప్రయాణం చేయాల్సివస్తే మీరు వెళ్లాల్సిన చోటుకు ఏ బస్సు ఎక్కాలో ఎవరినైనా అడుగుతారు. ఆ బస్సు ఎక్కడ ఎక్కాలి, మీరు వెళ్లాల్సిన దారిలోనే వెళ్తున్నారా లేదా తెలుసుకోవడానికి దారి మధ్యలో కనపడే కొన్ని గుర్తులు, వివరాలు కూడా ముందే కనుక్కుంటారు. ప్రయాణం చేస్తున్నప్పుడు మీకు చెప్పిన గుర్తులన్నీ కనిపిస్తే మీరు సరైన దారిలోనే వెళ్తున్నారనే నమ్మకం మీకు వస్తుంది. అదే విధంగా, అంతం వచ్చే ముందు లోకంలో స్పష్టంగా కనపడే కొన్ని విషయాలను దేవుడు తన వాక్యంలో వివరించాడు. అవన్నీ జరగడం చూసినప్పుడు మనం అంతానికి చాలా దగ్గర్లో ఉన్నామని నమ్మకం కుదురుతుంది.

ప్రపంచం ముందెన్నడూ లేని, అత్యంత కీలకమైన దశకు చేరుకుంటోంది, అప్పుడు ఆ సమయంలో అంతం వస్తుందని దేవుని వాక్యం వివరిస్తుంది. మానవ చరిత్రలో అప్పటివరకు జరగని సంఘటనలు, పరిస్థితులు ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతాయి. వాటిల్లో కొన్ని ఇప్పుడు చూద్దాం.

**1. ప్రపంచమంతటా అలజడులు** మత్తయి పుస్తకం 24వ అధ్యాయం కొన్ని సంఘటనల గురించి చెప్తుంది. అవన్నీ కలిపి ఒకే సూచన. ఈ సూచన “యుగసమాప్తికి” గుర్తుగా ఉంటుంది, ఆ తర్వాత “అంతము” వస్తుంది. (3, 14 వచనాలు) పెద్దపెద్ద యుద్ధాలు, కరువులు, అక్కడక్కడ భూకంపాలు, అక్రమాలు పెరిగిపోవడం, మనుషుల మధ్య ప్రేమ లేకపోవడం, మతనాయకులు కుయుక్తిగా మనుషులను మోసం చేయడం వంటివి ఈ సూచనలో భాగం. (6-26 వచనాలు) నిజమే, వందల ఏళ్లుగా ఇవన్నీ కనిపించినా, అంతం దగ్గరపడినప్పుడు, ఈ విషయాలన్నీ ఈ కష్టకాలంలోనే జరుగుతాయి. ఈ సూచనతోపాటు ఇంకో మూడు కూడా జరుగుతాయి. వాటిని కూడా చూద్దాం.

**2. మనుషుల ప్రవర్తన, ఆలోచన తీరు** “అంత్యదినములలో” అంటే అంతానికి ముందున్న సమయంలో మనుషుల ప్రవర్తన, ఆలోచనలు చెడిపోతాయని దేవుని వాక్యంలో ఉంది. “ఈ సంగతి తెలుసుకో – చివరిరోజులలో మహా కష్టమైన సమయాలు వస్తాయి. ఎందుకంటే, మనుషులు ఇలా ఉంటారు: స్వార్థప్రియులు, డబ్బంటే ప్రేమ గలవారు, బడాయికోరులు, అహంకారులు, దూషకులు, తల్లిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞత లేనివారు, అపవిత్రులు, ప్రేమ లేనివారు, తీరని పగ గలవారు, అపనిందలు ప్రచారం చేసేవారు, తమను అదుపులో పెట్టుకోనివారు, క్రూరులు, మంచి అంటే గిట్టనివారు, ద్రోహులు, జాగ్రత్త లేని మూర్ఖులు, గర్విష్ఠులు, దేవునికి బదులు సుఖాన్నే ప్రేమించేవారు.” (2 తిమోతి 3:1-4, *పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) నిజమే, సాటి మనుషులను గౌరవించకపోవడం కొత్తేమీ కాదు, కాని “చివరిరోజులలో” మాత్రం ఇలాంటివన్నీ విపరీతంగా పెరిగిపోతాయి. అందుకే అది “మహాకష్టమైన” సమయం. అసహ్యం పుట్టించే ఈ లక్షణాలను మనుషుల్లో మీరు గమనించే ఉంటారు.

**3. భూమిని మనుషులు పాడుచేస్తున్నారు** “భూమిని నశింపజేయువారిని” దేవుడు నాశనం చేస్తాడని ఆయన వాక్యంలో ఉంది. (ప్రకటన 11:18) మనుషులు భూమిని ఏయే విధాలుగా నాశనం చేస్తున్నారు? నోవహు జీవించిన కాలం గురించి ఇలా ఉంది: “భూలోకము దేవుని సన్నిధిని చెడిపోయియుండెను; భూలోకము బలాత్కారముతో నిండియుండెను. దేవుడు భూలోకమును చూచినప్పుడు అది చెడిపోయి యుండెను.” అప్పటి చెడిపోయిన సమాజం గురించి దేవుడు ఇలా చెప్పాడు: “వారిని . . . నాశనము చేయుదును.” (ఆదికాండము 6:11-13) రోజురోజుకి భూమ్మీద హింస పెరిగిపోతుంది అనడానికి రుజువులు మీరు కూడా గమనించే ఉంటారు. అంతేకాదు, చరిత్రలో మొదటిసారిగా మొత్తం మానవజాతినే లేకుండా చేసి, భూమిని

ప్రపంచవ్యాప్తంగా వందల భాషల్లో
దేవుని రాజ్యం గురించి చెప్తున్నారు



నాశనం చేసే శక్తి ఇప్పుడు మనిషి చేతిలో ఉంది. అలా చేయడానికి కావాల్సిన ఆయుధాలు ఉన్నాయి. భూమి మరో విధంగా కూడా పాడౌతుంది. భూమ్మీద జీవానికి కావాల్సినవి అంటే మనం పీల్చుకునే గాలి, జంతు, వృక్ష సంపద, సముద్రాలు వంటివన్నీ మనుషుల నిర్లక్ష్యంవల్ల అస్తవ్యస్తం అయిపోతున్నాయి.

ఒకసారి ఆలోచించండి, ఒక వందేళ్ల క్రితం మొత్తం మానవ జాతిని నాశనం చేసే శక్తి మనిషికి ఉందా? కానీ ఇప్పుడు ఆ శక్తితో భయంకరమైన ఆయుధాలను సమకూర్చుకుంటున్నాడు, పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడు. ఇప్పుడు టెక్నాలజీ ఎంతో వేగంగా పరుగులు తీస్తోంది కానీ టెక్నాలజీ వల్ల వచ్చే సమస్యలను, వాటిని అరికట్టే విధానాలను మనిషి అంత వేగంగా కనుక్కోలేకపోతున్నాడు. నిజానికి ఈ భూమి భవిష్యత్తు మనిషి చేతుల్లో లేదు. భూమ్మీద ప్రాణులు లేకుండాపోయే కాలం రాకముందే, భూమిని నాశనం చేసేవాళ్లను నాశనం చేస్తానని దేవుడు మాటిస్తున్నాడు.

**4. ప్రపంచవ్యాప్త ప్రకటనా పని**అంతానికి ముందు కనపడే సూచనలో భాగంగా ముందెప్పుడూ జరగని ఒక పెద్ద పని జరుగుతుంది. "ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటు తరువాత అంతము వచ్చును." (మత్తయి 24:14) తరతరాలుగా మతాలు చేస్తున్న ప్రచారానికి ఈ పనికి చాలా తేడా ఉంది. అంత్యదినాల్లో, ఒక విషయాన్ని ఎక్కువగా చెప్తారు అదే "ఈ రాజ్య సువార్త." ఈ వార్తను ఎక్కువగా చెప్తున్నది ఎవరో మీకు తెలుసా? కొందరు ఇలా చెప్తున్నట్టు అనిపించినా, కేవలం వాళ్లున్న ప్రాంతాల్లోనే ఈ పని చేస్తున్నారా లేదా "సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతట" ఈ వార్తను వ్యాప్తి చేస్తున్నారా?

www.jw.org వెబ్‌సైట్ "ఈ రాజ్య సువార్త" గురించే ఎక్కువగా చెప్తుంది. ఈ వెబ్‌సైట్‌లో 700కన్నా ఎక్కువ భాషల్లో రాజ్య వార్తకు సంబంధించిన సమాచారం చూడవచ్చు. రాజ్య సువార్త ప్రపంచంలో అందరికి తెలిసేలా చేస్తున్న వేరే ఏదైనా కార్యక్రమం మీకు తెలుసా? ఇంటర్నెట్ రావడానికి చాలా కాలం ముందునుండే దేవుని రాజ్యం గురించిన వార్తను అందరికీ చెప్పడానికి యెహోవాసాక్షులు చాలా కృషి చేశారు. ఈ విషయంలో వాళ్లు మంచి పేరు సంపాదించుకున్నారు. 1939 నుండి వచ్చిన ప్రతీ కావలికోట పత్రిక ముందు పేజీలో "యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది" అనే పదాలు కనిపిస్తాయి. మతాల గురించిన ఒక పుస్తకం యెహోవాసాక్షులు చేసిన ప్రకటన పని గురించి "ఇంత ఎక్కువగా, ఇంత విస్తృతంగా ఇంక ఎవ్వరూ చేయలేదు" అని చెప్పింది. "అంతము" దేవుని రాజ్యం ద్వారా వస్తుంది అనే మంచి వార్తను ఈ ప్రకటనా పని ముఖ్యంగా చెప్తుంది.

## మానవ చరిత్రలో అత్యంత కీలకమైన సమయం

దేవుని వాక్యం చెప్పిన సూచనలన్నీ మీ జీవితకాలంలోనే జరుగుతున్నాయని మీరు గమనించారా? ఈ పత్రిక వందేళ్లకు పైగా, లోక సంఘటనల గురించి చెప్తూ, అంతం చాలా దగ్గర్లో ఉందనే రుజువులు సొంతగా తెలుసుకోవడానికి పాఠకులకు సహాయం చేసింది. అయితే వాస్తవాలు, గణాంకాలు పరిస్థితులు మారినప్పుడు మారతాయని లేదా మనుషులు వాటిని

**యెహోవాసాక్షులు భూమి నాశనమౌతుందని చెప్తారా?** యెహోవాసాక్షులు అంతం గురించి చెప్పి భయపెట్టేవాళ్లు కాదు. బదులుగా, వందేళ్లకు పైగా భవిష్యత్తు గురించిన మంచి వార్తను చెప్తున్నారు. ఉదాహరణకు, 1958లో వాళ్లు జరుపుకున్న సమావేశంలో, "దేవుడి రాజ్యం పరిపాలిస్తుంది—లోకాంతం సమీపంలో ఉందా?" అనే అంశంపై ఇచ్చిన ప్రసంగంలో ఇలా చెప్పారు: "దేవుని రాజ్యం భూమిని నాశనం చేయడానికి కాదుగాని, సాతాను లోకాన్ని నాశనం చేయడానికి వస్తుంది. దేవుని రాజ్యం ఈ భూమిని అగ్నితో నాశనం చేయడానికి కాదు గాని దేవుని చిత్తం భూమ్మీద, పరలోకంలో జరిగించడానికి వస్తుంది. అందుకే, దేవుడు సృష్టించిన భూమి నిలిచి ఉండాలి, అది ఎప్పటికీ నిలిచి ఉండేలా ఆయన చూసుకుంటాడు."

మార్చవచ్చని ఇలాంటి రుజువులను కొందరు కొట్టిపారేస్తారు. ముందులా కాకుండా ఇప్పుడు టెక్నాలజీ వల్ల లోకంలో జరిగేవన్నీ మనకు తెలిసిపోతున్నాయి. కాబట్టి పరిస్థితులు అంతకంతకు చెడిపోతున్నట్టు మనకు అనిపిస్తుందని వాళ్లంటారు. అయితే, మానవ చరిత్రలో ఒక కీలకమైన ఘట్టం ముగింపులో మనం ఇప్పుడు ఉన్నామని చెప్పడానికి ఎన్నో రుజువులు ఉన్నాయి.

ఈ భూమ్మీద పెద్దపెద్ద మార్పులు జరగబోతున్నాయని కొంతమంది నిపుణులు అంటున్నారు. ఉదాహరణకు, మానవజాతినే లేకుండా చేసే కొన్ని ప్రమాదాల గురించిన హెచ్చరికల్ని 2014లో *బులెటిన్ ఆఫ్ ది అటామిక్ సైంటిస్ట్స్* అనే పత్రిక ఐక్య రాజ్య సమితి భద్రతా మండలికి చెప్పింది. ఆ విజ్ఞాన శాస్త్రజ్ఞులు ఇలా అన్నారు: "ఈ ప్రమాదాలన్నిటిని జాగ్రత్తగా పరిశీలించినప్పుడు టెక్నాలజీ వల్ల మానవజాతి లేకుండాపోయే అవకాశం చాలాచాలా ఎక్కువగా ఉందని తెలుస్తుంది." మానవ చరిత్రలో కీలకమైన దశకు చేరుకున్నామని చాలామంది గట్టిగా నమ్ముతున్నారు. ఆ దశే ఈ లోకానికి చివరి రోజులని, అంతం దగ్గర్లో ఉందనే విషయంలో ఈ పత్రిక ప్రచురణకర్తలకు, పాఠకులకు ఏ సందేహం లేదు. కాని భవిష్యత్తు గురించి భయపడే బదులు జరగబోయేవాటి గురించి మీరు సంతోషించవచ్చు. ఎందుకు? ఎందుకంటే, మీరు అంతాన్ని తప్పించుకోవచ్చు! (*w15*-E 05/01)

# అంతాన్ని చాలామంది తప్పించుకుంటారు మీరూ తప్పించుకోవచ్చు



అంతం వచ్చినప్పుడు నాశనం జరుగుతుందని దేవుడు చెప్తున్నాడు. "లోకారంభము నుండి ఇప్పటివరకును అట్టి శ్రమ కలుగలేదు . . . ఆ దినములు తక్కువ చేయబడకపోయినయెడల ఏ శరీరియు తప్పించుకొనడు." (మత్తయి 24:21, 22) చాలామంది తప్పించుకుంటారని దేవుడు మాటిస్తున్నాడు: "లోకము . . . గతించిపోవుచున్నది గాని, దేవుని చిత్తమును జరిగించువాడు నిరంతరమును నిలుచును."—1 యోహాను 2:17.

లోకాంతాన్ని తప్పించుకుని నిరంతరం జీవించాలంటే మీరేమి చేయాలి? ఆహారం, ఇతర అవసరమైన వస్తువులను కూడపెట్టుకోవాలా? కాదుగానీ, మనం ఆధ్యాత్మిక విషయాలపై మనసు పెట్టాలని దేవుడు చెప్తున్నాడు. "ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక . . . దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను." (2 పేతురు 3:10-12) ఇక్కడ "ఇవన్నియు" అంటే ఏమిటో పేతురు పుస్తకంలోని ముందున్న మాటలను చూస్తే మనకు అర్థమౌతుంది. అవి ఈ చెడిపోయిన లోక ప్రభుత్వాలు, దేవున్ని వద్దని ఈ లోక ప్రభుత్వాలకు మద్దతిస్తున్న వాళ్లు. వాళ్లు లయమైపోతారు లేదా అంతమౌతారు. కాబట్టి, ఏవేవో వస్తువులు కూడపెట్టుకున్నంత మాత్రాన అంతాన్ని తప్పించుకోలేము.

మన ప్రాణాలను కాపాడుకోవాలంటే యెహోవా దేవుని పట్ల భక్తితో ఉంటూ, ఆయనకు నచ్చిన విధంగా ప్రవర్తించడం నేర్చుకోవాలి. (జెఫన్యా 2:3) మనం ఇప్పుడు చాలా ప్రాముఖ్యమైన కాలంలో జీవిస్తున్నామనే సూచనలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఇప్పుడు చాలామంది ప్రజలు ఈ సూచనలను చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. మనం వాళ్లలా కాకుండా "దేవుని దినపు రాకడ" కోసం కనిపెట్టుకుంటూ ఉందాం. మీకిష్టమైతే, రాబోయే అంతాన్ని తప్పించుకోవడానికి ఏమి చేయాలో యెహోవాసాక్షులు దేవుని వాక్యం నుండి మీకు చూపిస్తారు. ■

(*w15*-E 05/01)

## బైబిల్లో ఉన్నవి నమ్మడానికి పురావస్తుశాస్త్ర ఆధారాలు ఉన్నాయా?



యెషయా 20:1లో ఉన్న అష్షూరు రాజు సర్గోను II

బ్రిటిష్ మ్యూజియం నుండి తీసుకున్న చిత్రం

బైబిల్లో హీబ్రూ భాషలో ఉన్న పుస్తకాల్లోని (చాలామంది ఆ పుస్తకాలను పాత నిబంధన అంటారు) "దాదాపు 50మంది," ఒకప్పుడు నిజంగా ఉన్నారు అన డానికి ఆధారాలు దొరికాయి అని *బిబ్లికల్ ఆర్కియాలజీ రివ్యూ* పత్రికలో వచ్చిన ఒక ఆర్టికల్ చెప్పింది. వాళ్లలో యూదా, ఇశ్రాయేలు దేశాల రాజులు 14 మంది ఉన్నారు. అందరికీ బాగా తెలిసిన దావీదు, హిజ్కియా రాజులతో పాటు అంతగా తెలియని మెనహేము, పెకహు రాజులు కూడా వాళ్లలో ఉన్నారు. అంతేకాదు ఐదుగురు ఈజిప్టు ఫరోలు ఇంకా అష్షూరు, బబులోను, మోయాబు, పర్షియా, సిరియా దేశాల 19 మంది రాజులు కూడా ఉన్నారు. కేవలం రాజులే కాదు ప్రధాన యాజకులు, ఒక శాస్త్రి, ఇతర అధికారులు కూడా ఆ 50 మందిలో ఉన్నారు.

వాళ్లందరూ ఒకప్పుడు నిజంగా ఉన్నారని చాలామంది పురావస్తు శాస్త్ర వేత్తలు ఒప్పుకున్నట్లు ఆ ఆర్టికల్ చెప్పింది. అలాగే, బైబిల్లో గ్రీకు భాషలో ఉన్న పుస్తకాల్లోని (చాలామంది ఆ పుస్తకాలను కొత్త నిబంధన అంటారు) చాలామంది కూడా ఒకప్పుడు నిజంగా ఉన్నారనడానికి ఆధారాలు ఉన్నాయి. ఉదాహరణకు హేరోదు, పొంతి పిలాతు, తిబెరి, కయప, సెర్గి పౌలు వంటివాళ్లు. ■

(*w15*-E 05/01)

## బైబిలు ప్రాంతాల్లో సింహాలు ఎప్పుడు కనుమరుగయ్యాయి?



పురాతన బబులోనులో ఉన్న మెరిసే ఇటుకల గోడ

ఇస్తాంబుల్ ఆర్కియాలజీ మ్యూజియం నుండి తీసుకున్న చిత్రం

బైబిల్లో ఇశ్రాయేలు, పాలస్తీనా, ఆ చుట్టుపక్కల ప్రాంతాల గురించి ఉంది. ఆ దేశ అడవుల్లో ఇప్పుడు సింహాలు ఎక్కడా లేవు. కానీ, బైబిల్లో సింహాల గురించి దాదాపు 150 సార్లు ఉంది. అంటే అవి బైబిలు రచయితలకు బాగా తెలుసుండాలి. బైబిల్లో కొన్ని విషయాలను సింహాలతో పోలుస్తూ చెప్పారు. అయితే కొందరికి సింహాలు ఎదురుపడిన సందర్భాలు కూడా బైబిల్లో ఉన్నాయి. సమ్సోను, దావీదు, బెనాయా సింహాలను చంపారు. (న్యాయాధిపతులు 14:5, 6; 1 సమూయేలు 17:34, 35; 2 సమూయేలు 23:20) సింహాలు కూడా కొందరిని చంపాయని బైబిల్లో ఉంది.—1 రాజులు 13:24; 2 రాజులు 17:25.

పురాతన కాలంలో బైబిలు ప్రాంతాల్లో సింహాలకు భయపడేవాళ్లు, వాటిని గౌరవించేవాళ్లు. కొంతమంది వాళ్ల గోడలను సింహాల బొమ్మలతో అలంకరించే వాళ్లు, లేదా గోడలపై సింహాల బొమ్మలను వేసుకునేవాళ్లు. బబులోను రాజులు ఊరేగింపుగా వెళ్లిన దారిలో కూడా మెరిసే ఇటుక గోడలపై సింహం బొమ్మలున్నాయి.

12వ శతాబ్దం చివర్లో క్రూసేడర్లు (మతం కోసం యుద్ధాలు చేసిన క్రైస్తవులు) పాలస్తీనా ప్రాంతంలో సింహాలను వేటాడినట్లు నివేదికలు ఉన్నాయి. 1300వ సంవత్సరం తర్వాత ఆ ప్రాంతంలో సింహాలు అంతరించిపోయి ఉండవచ్చు. అయితే మెసొపొతమియ, సిరియాలో 19వ శతాబ్దం వరకు; ఇరాన్, ఇరాక్‌లో 1950 వరకు సింహాలు ఉన్నట్లు నివేదికలు ఉన్నాయి. ■

(*w15*-E 05/01)

# యెహోవా దయ చూపించే, క్షమించే దేవుడని తెలుసుకున్నాను



నార్మాన్‌ పెల్తే చెప్పినది

పుట్టిన సంవత్సరం
1954
దేశం
కెనడా
ఒకప్పుడు
మోసాలు చేసేవాడిని, జూదం ఆడేవాడిని



**నా గతం:** మాంట్రియల్‌ నగరంలో ఉద్యోగాలు, వ్యాపారాలు అంతగా లేని ఒక ప్రాంతంలో నేను జీవించాను. నేను ఆరు నెలల బాబుగా ఉన్నప్పుడే మా నాన్న చనిపోయారు. దానితో ఇంటి బాధ్యతంతా అమ్మ మీదే పడింది. ఎనిమిది మంది పిల్లల్లో నేనే చిన్నవాణ్ని.

మత్తుమందులు, జూదం, హింస వంటివాటి మధ్య నా బాల్యం గడిచింది. నేరాలు చేసే వాళ్ల మధ్య పెరిగాను. పదేళ్లు వచ్చేసరికి వేశ్యలకు, వడ్డీ వ్యాపారులకు చిన్నచిన్న పనులు చేయడం మొదలుపెట్టాను. అబద్ధాలు చెప్తూ, ప్రజల్ని మోసం చేస్తూ ఆనందించేవాణ్ని. ఆ ఆనందం ఒక మత్తుమందులా ఉండేది.

14 ఏళ్లు వచ్చేసరికే కొత్తకొత్త పద్ధతుల్లో ప్రజల్ని మోసం చేయడంలో ఆరితేరాను. ఉదాహరణకు, బంగారు పూత పూసిన వాచీలు, బ్రేస్‌లెట్‌లు, ఉంగరాలు ఎక్కువ సంఖ్యలో కొని వాటికి ఏదో ఒక సంస్థ పేరుతో 14 క్యారెట్ల బంగారం అని ముద్ర వేసి వాటిని వీధుల్లో, షాపింగ్‌ సెంటర్ల పార్కింగ్‌ స్థలాల్లో అమ్మేవాణ్ని. సులభంగా డబ్బులు సంపాదించడం నచ్చి, దాని గురించే ఆలోచించేవాణ్ని. ఒకసారైతే, ఒకేరోజు ఐదు లక్షల రూపాయలు సంపాదించాను.

15 ఏళ్లప్పుడు బాల నేరస్తులను సరిదిద్దే స్కూల్‌ నుండి నన్ను బయటకు పంపించేశారు. దానితో ఇక ఉండడానికి చోటు లేకుండా పోయింది. వీధుల్లో, పార్కుల్లో లేదా ఎవరైనా తెలిసిన వాళ్ల ఇంట్లో పడుకున్నాను.

నేను చేసే మోసాల వల్ల పోలీసులు నన్ను చాలాసార్లు ప్రశ్నించారు. అయితే దొంగతనం చేసిన వస్తువుల్ని అమ్మట్లేదు కాబట్టి జైలుకు పంపలేదు. కానీ, వేరేవాళ్ల పేరుతో మోసం చేసినందుకు, పర్మిట్‌ లేకుండా అమ్ముతున్నందుకు పెద్దపెద్ద జరిమానాలు కట్టాను. ఎవరికీ భయపడకుండా, వడ్డీ వ్యాపారుల తరఫున డబ్బులు వసూలు చేశాను. ఆ పని చాలా ప్రమాదకరమైనది. కాబట్టి, కొన్నిసార్లు గన్ను పెట్టుకుని తిరిగాను. కొన్నిసార్లు నేరాలు చేసే ముఠాలతో కూడా పనిచేశాను.

**బైబిలు నా జీవితాన్ని ఎలా మార్చిందంటే . . .** 17 ఏళ్లప్పుడు నేను మొదటిసారిగా బైబిలు గురించి తెలుసుకున్నాను. నేను నా స్నేహితురాలితో కలిసి ఉంటున్నప్పుడు ఆమె యెహోవాసాక్షుల దగ్గర బైబిలు గురించి నేర్చుకోవడం మొదలుపెట్టింది. చెడు పనుల విషయంలో

బైబిలు కట్టుబాట్లు నచ్చక ఆమెను విడిచిపెట్టి, నేను డేటింగ్ చేస్తున్న మరో అమ్మాయితో ఉండడానికి వెళ్లిపోయాను.

అయితే ఈ అమ్మాయి కూడా యెహోవాసాక్షుల దగ్గర బైబిలు గురించి నేర్చుకోవడం మొదలు పెట్టడంతో నా జీవితం మలుపు తిరిగింది. ఆమె చాలా మార్పులు చేసుకుంది. ఆమె ఇంకా శాంతంగా, సహనంగా మారడం నన్ను ఆకట్టుకుంది. యెహోవాసాక్షుల రాజ్యమందిరానికి ఆహ్వానించినప్పుడు నేను వెళ్లాను. చాలా పద్ధతి గల, దయ గల ప్రజలు అక్కడ నాతో మాట్లాడారు. నేను చూసిన లోకానికి, వాళ్లకు అసలు పోలికే లేదు! నా కుటుంబం నన్ను పట్టించుకోలేదు; చిన్నప్పుడు ప్రేమ, ఆప్యాయత అంటే ఏంటో నాకు తెలియదు. యెహోవాసాక్షులు నాపై చూపించిన ప్రేమ మరవలేనిది. నిజంగా, అలాంటి ప్రేమ కోసమే నేను తపించాను. నాకు బైబిలు గురించి నేర్పిస్తామని వాళ్లు అన్నప్పుడు, వెంటనే ఒప్పుకున్నాను.

బైబిలు నుండి నేర్చుకున్న విషయాలే నా ప్రాణాలు కాపాడాయి. జూదం ఆడి దాదాపు 25 లక్షల అప్పు చేశాను. దాన్ని తీర్చడానికి, ఇద్దరితో కలిసి బ్యాంకు దోపిడీకి ప్లాన్ చేశాను. అయితే నేను అలా చేయకూడదని నిర్ణయించుకున్నాను. అది చాలా మంచిదైంది! మిగతా ఇద్దరు మాత్రం ఆ దొంగతనానికి వెళ్లారు. వాళ్లలో ఒకరిని అరెస్ట్ చేశారు, ఇంకొకరిని చంపేశారు.

బైబిలు గురించి నేర్చుకుంటున్నప్పుడు, నేను చాలా మార్పులు చేసుకోవాలని నాకు అర్థమైంది. ఉదాహరణకు, 1 కొరింథీయులు 6:10లో "దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" అని చదివాను. నా పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థమై కన్నీళ్లు పెట్టుకున్నాను. నన్ను నేను చాలా మార్చుకోవాలని అర్థమైంది. (రోమీయులు 12:2) నేను చాలా క్రూరున్ని, కోపిష్ఠిని. నా జీవితమంతా అబద్ధాలే.

అయితే, యెహోవా దయగలవాడని, క్షమించే మనసున్నవాడని నేను బైబిలు నుండి తెలుసుకున్నాను. (యెషయా 1:18) నా పాత జీవితాన్ని విడిచిపెట్టడానికి సహాయం చేయమని ప్రార్థనలో దేవున్ని బతిమాలాను. ఆయన సహాయంతో మెల్లమెల్లగా మారాను. నేను కలిసివుంటున్న అమ్మాయితో నా పెళ్లిని రిజిస్టరు చేసుకోవడం ఒక ముఖ్యమైన మార్పు.

అప్పుడు నాకు 24 ఏళ్లు. మాకు ముగ్గురు పిల్లలున్నారు. ఇప్పుడు నిజాయితీగా పనిచేయడానికి నాకు ఒక ఉద్యోగం కావాలి. నాకు పెద్దగా చదువులేదు, నన్ను ఉద్యోగంలో చేర్చుకోమని చెప్పేవాళ్లు ఎవరూ లేరు. యెహోవాకు మళ్లీ బలంగా ప్రార్థించి ఉద్యోగం వెతకడం కోసం వెళ్లాను. నా జీవితాన్ని మార్చుకుని, నిజాయితీగా పనిచేయాలి అనుకుంటున్నానని ఉద్యోగం ఇచ్చేవాళ్లతో చెప్పాను. బైబిలు గురించి నేర్చుకుంటున్నానని, మంచి పౌరున్ని కావాలనుకుంటున్నానని కూడా కొన్నిసార్లు చెప్పాను. ఎవరూ నన్ను ఉద్యోగంలోకి తీసుకోలేదు. చివరిగా, ఒక ఇంటర్వ్యూలో నా గతం మొత్తం వివరించాక, ఇంటర్వ్యూ చేస్తున్నతను ఇలా అన్నాడు: "ఎందుకో తెలీదు కానీ, నీకు ఉద్యోగం ఇవ్వాలి అనిపిస్తుంది." అది నా ప్రార్థనలకు వచ్చిన జవాబని నమ్మాను. కొంతకాలానికి నేను, నా భార్య బాప్తిస్మం తీసుకుని యెహోవాసాక్షులం అయ్యాం.



**బైబిలు సూత్రాలు పాటించడం వల్లే నేను ఈరోజు ప్రాణాలతో ఉన్నాను**

**నేనెలా ప్రయోజనం పొందానంటే . . .** బైబిలు సూత్రాలను పాటిస్తూ, క్రీస్తును అనుసరిస్తూ జీవిస్తున్నందు వల్లే నేను ఈ రోజు ప్రాణాలతో ఉన్నాను. నాకు ఒక చక్కని కుటుంబం ఉంది. యెహోవా నన్ను క్షమించాడని నమ్ముతున్నాను, దాని వల్ల మంచి మనస్సాక్షిని పొందాను.

గత 14 సంవత్సరాలుగా నేను ప్రతీనెల 70 గంటలు ప్రకటనా పని చేస్తూ బైబిలు చెప్తున్నదేంటో తెలుసుకునేలా తోటి వాళ్లకు సాయం చేస్తున్నాను. ఈ మధ్యే నా భార్య కూడా నాతోకలిసి 70 గంటలు చేయడం మొదలుపెట్టింది. గడిచిన 30 ఏళ్లలో నా తోటి ఉద్యోగులు 22 మందికి యెహోవా ఆరాధకులయ్యేలా సాయం చేయడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. ఇప్పటికీ నేను షాపింగ్ సెంటర్‌లకు వెళ్తున్నాను, కానీ ఒకప్పటిలా ప్రజల్ని మోసం చేయడానికి కాదు. అక్కడికి వెళ్లినప్పుడు నా నమ్మకాల్ని ఇతరులతో చెప్తుంటాను. మోసాలు చేసేవాళ్లు ఉండని కొత్తలోకం రాబోతుంది అనే మంచి వార్తను వాళ్లకు చెప్పాలని కోరుకుంటున్నాను.—కీర్తన 37:10, 11. ■

(*w15*-E 05/01)



# “నేను దేవుని స్థానమందున్నానా?”

యోసేపు సాయంకాలం తన తోటలో నిల్చుని ఉన్నట్లు ఊహించుకోండి. బహుశా ఆయన ఖర్జూరపు చెట్లను, పండ్ల చెట్లను, మొక్కలతో నిండి ఉన్న నీటి మడుగులను చూస్తుండవచ్చు. ప్రహరి గోడ అవతల ఉన్న ఫరో అంతఃపురాన్ని కూడా ఒక్క క్షణం చూసి ఉంటాడు. మధ్య మధ్యలో ఇంట్లో నుండి వచ్చే శబ్దాలు ఆయన చెవులకు వినపడుతున్నాయి. యోసేపు ఇద్దరి కొడుకుల్లో పెద్దవాడైన మనష్షే చిన్నవాడైన ఎఫ్రాయిముని ఆడిస్తూ నవ్విపిస్తుంటే, ఆ చేష్టలకు యోసేపు భార్య చిన్నగా నవ్వుతుంటుంది. లోపల ఏమి జరుగుతుందో ఊహించుకుని యోసేపు చిన్నగా నవ్వుకుంటాడు. యెహోవా ఆయనను ఆశీర్వదించాడని యోసేపుకు తెలుసు.

యోసేపు పెద్ద కొడుక్కి మనష్షే అనే పేరు పెట్టాడు. ఎందుకంటే ఆ పేరుకు మర్చిపోవుట అని అర్థం. (ఆదికాండము 41:51) కొన్ని సంవత్సరాల నుండి యోసేపును దేవుడు ఆశీర్వాదిస్తున్నాడు. వాటివల్ల ఇల్లు, అన్నదమ్ములు, తండ్రి గుర్తు వచ్చినప్పుడల్లా కలిగే బాధ కాస్త తగ్గింది. అతని అన్నలకు ఆయన మీదున్న ద్వేషం ఆయన జీవితాన్నే మార్చేసింది. వాళ్లు ఆయన్ని కొట్టారు, చంపేయాలనుకున్నారు, తర్వాత ఆయన్ని వర్తకులకు బానిసగా అమ్మేశారు. అప్పటి నుండి ఆయన జీవితం ఒకదాని తర్వాత ఒకటిగా మలుపులు తిరిగింది. దాదాపు 12 సంవత్సరాలు బానిసత్వాన్ని, చెరసాల జీవితాన్ని అనుభవించాడు. కొంతకాలం చెరసాలలో ఇనుప సంకెళ్లతో కూడా ఉన్నాడు. కాని ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాడు. ఆ గొప్ప ఐగుప్తు దేశంలో ఫరో తర్వాత యోసేపే ముఖ్య అధికారి.*

* ఆగస్టు 1, 2014; నవంబరు 1, 2014; ఫిబ్రవరి 1, 2015 కావలికోట (ఇంగ్లీషు) పత్రికల్లో “వారి విశ్వాసాన్ని అనుసరించండి” ఆర్టికల్స్ చూడండి.

చాలా సంవత్సరాలనుండి యెహోవా చెప్పినవన్నీ జరగడాన్ని యోసేపు చూశాడు. యెహోవా చెప్పినట్లుగానే ఏడు సంవత్సరాలు ఐగుప్తులో పంట బాగా పండింది. అప్పుడు దేశంలో ఎక్కువ పండిన ధాన్యమంతటిని నిల్వచేసే పనిని యోసేపు చూసుకున్నాడు. ఆ సమయంలో ఆయన భార్య ఆసెనతు ఇద్దరు కొడుకులకు జన్మనిచ్చింది. అయినా యోసేపుకు ఎక్కడో దూరంలో ఉన్న తన ఇల్లు గుర్తుకువచ్చేది. ముఖ్యంగా తమ్ముడు బెన్యామీనును, తనెంతో ప్రేమించే తండ్రి యాకోబును గుర్తుచేసుకునేవాడు. వాళ్లు క్షేమంగా ఉన్నారో లేదో అని యోసేపు ఆలోచించేవాడు. ఆయన అన్నలు వాళ్ల క్రూరమైన పనులు మానుకున్నారో లేదో, కుటుంబాన్ని తిరిగి కలుసుకుంటాడో లేదో అని కూడా బహుశా ఆలోచించి ఉంటాడు.

మీ కుటుంబంలో కూడా కుళ్ళు, మోసం, పగ వల్ల ప్రశాంతత దెబ్బతిని ఉంటే మీరు కూడా యోసేపు లాంటి పరిస్థితిలో ఉన్నట్లే. ఆ కుటుంబాన్ని చూసుకుంటున్నప్పుడు యోసేపు చూపించిన విశ్వాసం నుండి మనమేమి నేర్చుకోవచ్చు?

## ‘యోసేపు దగ్గరకు వెళ్లండి’

యోసేపు రోజూ పనిలో తీరిక లేకుండా ఉండేవాడు. అలా సంవత్సరాలు గడిచాయి. ఫరోకు వచ్చిన కలలో యెహోవా చెప్పినట్లుగానే ఏడు సంవత్సరాలు పంటలు పుష్కలంగా పండాక, పరిస్థితి తలకిందులైంది. పంటలు ఇంక పండలేదు. చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా కరువు వచ్చేసింది. కాని ఆ సమయంలో “ఐగుప్తు దేశమందంతటను ఆహారముండెను” అని బైబిలు చెప్తుంది. (ఆదికాండము 41:54) యోసేపు దేవుని సహాయంతో భవిష్యత్తు గురించి చెప్పిన విషయాలు, పనులన్నీ పద్ధతిగా చేయడంలో ఆయనకున్న సామర్థ్యం ఐగుప్తు ప్రజలకు చాలా ఉపయోగపడ్డాయి.

ఐగుప్తీయులు యోసేపుకు రుణపడి ఉన్నట్లు భావించి ఉంటారు. ఆయనకున్న సామర్థ్యాన్ని పొగిడి ఉంటారు. కాని యోసేపు ఆ గొప్పతనమంతా యెహోవాకే వెళ్లాలని కోరు కున్నాడు. మన శక్తిసామర్థ్యాలను యెహోవా సేవలో వినయంగా ఉపయోగిస్తే, ఆయన వాటన్నిటిని ఊహించనంతగా ఉపయో గపడేలా చేస్తాడు.

కొంత కాలానికి ఐగుప్తులో కూడా కరువు ప్రభావం కనిపిం చింది. ప్రజలు సహాయం కోసం ఫరో దగ్గర మొరపెట్టినప్పుడు ఆయన వాళ్లను "మీరు యోసేపునొద్దకు వెళ్లి అతడు మీతో చెప్పినట్లు" చేయమంటాడు. అప్పుడు యోసేపు ధాన్యం నిల్వచేసిన ధాన్యాగారాలను తెరిచి ప్రజలకు అమ్మాడు. —ఆదికాండము 41:55, 56.

కాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల పరిస్థితి దారుణంగా ఉంది. వందల మైళ్ల దూరంలో కనానులో ఉన్న యోసేపు కుటుంబం కూడా ఇబ్బందులు పడుతున్నారు. యాకోబు ఐగుప్తులో ధాన్యం ఉందని విని తన కొడుకుల్ని ఆహారం కొన డానికి వెళ్లమన్నాడు.—ఆదికాండము 42:1, 2.

యోసేపు గర్వం చూపించలేదు కాబట్టి యెహోవా ఆయన్ని ఉపయోగించుకున్నాడు



యాకోబు పది మంది కొడుకుల్ని పంపించాడు కానీ చిన్న కొడుకు బెన్యామీనును పంపలేదు. ఇదివరకు ఒకసారి తనకెంతో ఇష్టమైన యోసేపును వాళ్ల అన్నల దగ్గరకు ఒంటరిగా పంపిం చిన విషయం ఆయనకు బాగా గుర్తుంది. ఆయన యోసేపును చూసింది అదే చివరిసారి. అప్పుడతని అన్నలు, యాకోబు తన ప్రేమకు, ఆప్యాయతకు గుర్తుగా యోసేపుకు ఇచ్చిన కొత్త అంగీని చిరిగిపోయి రక్తం మరకలతో వాళ్ల నాన్న దగ్గరికి తెచ్చారు. అడవి మృగాలు యోసేపును తినేసి ఉంటాయని పాపం ఆ ముసలి తండ్రిని నమ్మించారు.—ఆదికాండము 37: 31-35.

## 'యోసేపు తన అన్నలను గుర్తుపట్టాడు'

యోసేపు అన్నలు చాలాదూరం ప్రయాణించి ఐగుప్తు చేరు కున్నారు. ధాన్యం ఎక్కడ కొనాలని అక్కడి వాళ్లను అడిగినప్పుడు, వాళ్లు జప్నత్పనేహు (ఐగుప్తులో యోసేపు పేరు) అనే ప్రభుత్వ అధికారి దగ్గరికి పంపించారు. (ఆదికాండము 41:45) వాళ్లు యోసేపును గుర్తుపట్టారా? లేదు. వాళ్లకు సహాయం చేయగల ఒక పెద్ద ఐగుప్తు అధికారిని మాత్రమే యోసేపులో చూశారు. గౌరవంతో వాళ్లు "ముఖములు నేలను మోపి అత నికి వందనము" చేశారు.—ఆదికాండము 42:5, 6.

మరి యోసేపు గుర్తు పట్టాడా? వెంటనే గుర్తు పట్టాడు. ఇంకా, వాళ్లు ఆయన ముందుకు వచ్చి నమస్కారం చేస్తుంటే ఆయన ఆలోచనలు చిన్నతనంలో జరిగిన విషయాల వైపుకు వెళ్ళాయి. దాని గురించి బైబిల్లో 'యోసేపు వారిని గూర్చి తాను కనిన కలలు జ్ఞాపకము చేసికొనెను' అని ఉంది. వాళ్ల అన్నలు ఆయనకు వంగి నమస్కారం చేస్తారని యెహోవా యోసేపుకు చిన్నప్పుడే కలల్లో చెప్పాడు. సరిగ్గా ఇప్పుడు అదే జరిగింది. (ఆదికాండము 37:2, 5-9; 42:7, 9) ఇది చూశాక యోసేపు ఏం చేస్తాడు? వాళ్లను దగ్గరికి తీసుకుంటాడా? పగ తీర్చుకుంటాడా?

ఇప్పుడు తన మనసులో అనిపించినదాన్ని బట్టి ఏమీ చేయ కూడదని యోసేపుకు తెలుసు. ఈ మలుపులన్నిటి వెనుక ఖచ్చితంగా యెహోవా ఉండి, ఆయన ఉద్దేశం ప్రకారం నడి పిస్తున్నాడు. ఆయన యాకోబు సంతానాన్ని గొప్ప దేశంగా చేస్తానని మాటిచ్చాడు. (ఆదికాండము 35:11, 12) ఒకవేళ యోసేపు అన్నలు ఇంకా క్రూరంగా, స్వార్థంగా, మూర్ఖంగా ఉన్నట్లయితే రానురాను వాళ్ల ప్రవర్తన చెడు ఫలితాలకు దారి తీసి ఉండేది. అంతేకాదు యోసేపు అప్పుడు తనకేది అనిపిస్తే అది చేసి ఉంటే అక్కడ కనానులో ఇంటి దగ్గర పరిస్థితులు దెబ్బతినే ప్రమాదం ఉంది. బహుశా ఆయన నాన్న, తమ్ముడి ప్రాణాలు ప్రమాదంలో పడవచ్చు. వాళ్లు బ్రతికి ఉన్నారో

లేదో? వాళ్ల అన్నలు మారారో లేదో తెలుసుకోడానికి తను ఎవ రన్నది తెలియనివ్వకూడదని యోసేపు నిర్ణయించుకున్నాడు. అప్పుడు ఆయన అన్నలతో ఎలా ఉండాలని యెహోవా కోరు కుంటున్నాడో తెలుసుకోవచ్చు.

మీకు ఇలాంటి పరిస్థితులు ఉండక పోవచ్చు. కానీ ఈ రోజుల్లో కుటుంబాల్లో గొడవలు, విభేదాలు సర్వసాధా రణం అయిపోయాయి. మనకు అలాంటి పరిస్థితులు వస్తే మన మనసు చెప్పినట్లు చేసి, తెలిసీతెలియని మన ఆలోచనల ప్రకారం ప్రవర్తిస్తామేమో. కానీ యోసేపులా దేవుని ఆలోచన లను తెలుసుకుని ఆయన కోరుకున్నట్లు చేయడం చాలా తెలివైన పని. (సామెతలు 14:12) ఒకటి గుర్తుపెట్టుకోవాలి: కుటుంబ సభ్యులతో సమాధానపడడం ఎంత ముఖ్యమో, యెహోవాతో ఆయన కుమారుడితో సమాధాన పడడం అంత కన్నా ప్రాముఖ్యం.—మత్తయి 10:37.

## ‘దీనివలన మీ నిజం తెలుస్తుంది’

అన్నల మనసు తెలుసుకోడానికి యోసేపు చాలా పరీక్షలు పెట్టాడు. హీబ్రూ భాష తెలిసినాసరే తెలీనట్లు ఒక అనువాద కున్ని ఉపయోగించి వాళ్లతో కఠినంగా మాట్లాడటం మొదలు పెట్టాడు, వాళ్లు పరాయి దేశం నుండి వచ్చిన గూఢచారులని నింద వేస్తాడు. అప్పుడు యోసేపు అన్నలు వాళ్లెవరో నిరూపిం చుకోడానికి, వాళ్ల కుటుంబం గురించి, వాళ్ల చిన్నతమ్ముడు ఇంటి దగ్గర ఉన్నాడన్న విషయం గురించి చెబుతారు. యోసేపు ఆయన ఆనందాన్ని కనబడకుండా దాచుకుంటాడు. చిన్నతమ్ముడు నిజంగా ఇంకా బ్రతికే ఉన్నాడా? ఇప్పుడు ఏమి చేయాలో యోసేపుకు అర్థమైంది. నేను మీ చిన్నతమ్ముణ్ని చూడాలి, అప్పుడు “మీ నిజము తెలియబడును” అని వాళ్లతో చెప్తాడు. వాళ్లలో ఒకరు తన దగ్గర బంధీగా ఉంటే మిగతా వాళ్లు వెళ్లి చిన్నవాడిని తీసుకురావచ్చని తర్వాత ఒప్పుకుంటాడు. —ఆదికాండము 42:9-20.

వాళ్లు మాట్లాడుకునేవి యోసేపుకు అర్థమౌతున్నాయి అనే విషయం యోసేపు అన్నలకు తెలీదు. 20 ఏళ్ల క్రితం పెద్ద పాపం చేసినందుకు వాళ్లను వాళ్లు నిందించుకుంటూ ఉంటారు. “నిశ్చయముగా మన సహోదరుని యెడల మనము చేసిన అపరాధమునకు శిక్ష పొందుచున్నాము. అతడు మన లను బతిమాలుకొనినప్పుడు మనము అతని వేదన చూచియు వినకపోతిమి; అందువలన ఈ వేదన మనకు వచ్చెనని ఒక నితో ఒకడు” మాటలాడుకుంటారు. యోసేపుకు వాళ్ల మాటలు అర్థమై కన్నీళ్లు ఆపుకోలేక పక్కకు వెళ్లాల్సి వచ్చింది. (ఆదికాండము 42:21-24) నిజమైన పశ్చాత్తాపం అంటే, చేసిన తప్పు వల్ల వచ్చే పర్యవసానాల గురించి బాధపడడం మాత్రమే కాదని ఆయనకు తెలుసు. కాబట్టి వాళ్లనింకా పరీక్షిం చాలనుకున్నాడు.

వాళ్లందరినీ ఇంటికి పంపించి షిమ్యోనును మాత్రం బందీగా ఉంచేస్తాడు. వాళ్లు ఇంటికి తీసుకెళ్లే ఆహార సంచుల్లో వాళ్లకు తెలీకుండా డబ్బులు కూడా పెట్టిస్తాడు. ఇంటికి చేరుకున్నాక, బెన్యామీనును వాళ్లతో పాటు ఐగుప్తు తీసుకెళ్లడానికి వాళ్ల నాన్న యాకోబును అతి కష్టం మీద ఒప్పిస్తారు. తిరిగి ఐగుప్తుకు వచ్చాక వాళ్ల సంచుల్లోకి వచ్చిన డబ్బు గురించి చెప్పి ఆ డబ్బుని తిరిగి ఇస్తా మంటారు. వాళ్ల నిజాయితీ మెచ్చుకునేలా ఉన్నా, యోసేపు వాళ్ల అసలు స్వభావం ఏంటో చూడాలనుకుంటాడు. వాళ్లకు భోజనం ఏర్పాటు చేస్తాడు. బెన్యామీనును చూడగానే అతనిలో వచ్చిన భావాలు బయటికి కనబడకుండా కష్టపడి ఆపుకుం టాడు. తర్వాత వాళ్లకు ధాన్యం ఇచ్చి ఇంటికి పంపించేస్తాడు. కానీ ఈసారి బెన్యామీను సంచిలో వెండి గిన్నెని దాచి ఉంచు తాడు.—ఆదికాండము 42:26–44:2.

తర్వాత అనుకున్న ప్రకారం వాళ్ల వెనుక మనుషులను పంపించి, వాళ్లను ఆపి వెండి గిన్నె దొంగిలించారని నింద వేస్తాడు. అది బెన్యామీను సంచిలో దొరికాక వాళ్లందరినీ వెనక్కు తెప్పిస్తాడు. ఇప్పుడు యోసేపుకు వాళ్ల అన్నలు ఎలాంటి వాళ్లో తెలుసుకునే అవకాశం వచ్చింది. యూదా వాళ్లందరి తరఫున మాట్లాడతాడు. క్షమాపణ కోసం బ్రతిమాలి కావాలంటే 11 మందిమి ఐగుప్తులో బానిసలుగా ఉండిపోతామని చెప్తాడు. బెన్యామీను మాత్రమే బానిసగా ఉండాలని మిగతా వాళ్లంతా వెళ్లిపోవాలని యోసేపు చెప్తాడు.—ఆదికాండము 44:2-17.

ఆ మాటలకు యూదా వెంటనే ముందుకొచ్చి, “వాని తల్లికి వాడొక్కడే మిగిలియున్నాడు, వాని తండ్రి వానిని ప్రేమించు చున్నాడని” చెప్తాడు. ఆ మాటలకు యోసేపు మనసు కదిలిపో యింది. ఎందుకంటే ఆయన యాకోబు ప్రియమైన భార్య రాహేలు పెద్ద కొడుకు. ఆమె బెన్యామీనుకు జన్మనిస్తూ చనిపో యింది. యోసేపు కూడా వాళ్ల తండ్రిలానే రాహేలును గుర్తుచే సుకునేవాడు. అందుకే బెన్యామీను అంటే యోసేపుకు చాలా ప్రేమ.—ఆదికాండము 35:18-20; 44:20.

బెన్యామీనును బంధించవద్దని యూదా బ్రతిమాలుతూనే ఉంటాడు. బెన్యామీనుకు బదులు బానిసగా ఉండిపోడానికి కూడా సిద్ధమౌతాడు. తర్వాత, “ఈ చిన్నవాడు నాతోకూడ ఉంటేనేగాని నా తండ్రి యొద్దకు నేనెట్లు వెళ్లగలను? వెళ్లినయెడల నా తండ్రికి వచ్చు అపాయము చూడవలసి” వస్తుంది అని హృదయం కదలిపోయేలా వేడుకుంటాడు. (ఆదికాండము 44:18-34) ఇక్కడ యూదాలో మారిన మనిషిని చూస్తాం.



చేసినదానికి అన్నలు పశ్చాత్తాప పడుతున్నారని యోసేపుకు అర్థమైంది

యూదా పశ్చాత్తాపం ఉన్న హృదయాన్నే కాదు, అవతలి వాళ్ల బాధను అర్థం చేసుకునే మనసుని, నిస్వార్థాన్ని, దయని చూపించాడు.

యోసేపు ఇక తట్టుకోలేకపోతాడు. ఇప్పటి వరకు దాచి పెట్టుకున్న భావాలను ఇక ఆపుకోలేకపోతాడు. పనివాళ్లందరినీ బయటకు పంపించి ఫరో అంతఃపురానికి వినపడేంతగా గట్టిగా ఏడ్చేస్తాడు. చివరికి తానెవరనే విషయం బయట పెడతాడు. "నేను యోసేపును," మీ తమ్ముణ్ని అని చెప్తాడు. అర్థం కాకుండా ఆశ్చర్యంగా చూస్తున్న అతని అన్నలను దగ్గరికి తీసుకుని వాళ్లు చేసినవాటన్నిటిని దయతో క్షమిస్తాడు. (ఆదికాండము 45:1-15) ఇలా చేసి ఆయన పూర్తిగా క్షమించే యెహోవా మనసును చూపిస్తాడు. (కీర్తన 86:5) మనం కూడా అలా క్షమిస్తామా?

## 'నువ్వు బ్రతికే ఉన్నావు'

యోసేపు ఇంట్లో జరిగిందంతా ఫరో విన్నప్పుడు, ఆయన యోసేపుని పిలిపించి వాళ్ల నాన్నను కుటుంబమంతటిని ఐగుప్తుకు తీసుకువచ్చేయమనే ఆహ్వానం ఇస్తాడు. అలా చివరికి యోసేపు వాళ్ల నాన్నను కలుసుకున్నాడు. యాకోబు ఏడ్చి "నీవింక బ్రదికియున్నావు; నీ ముఖము చూచితిని గనుక నేనికను చనిపోవుదునని" అంటాడు.—ఆదికాండము 45:16-28; 46:29, 30.

యాకోబు ఆ తర్వాత ఐగుప్తులో 17 సంవత్సరాలు బ్రతికి ఉన్నాడు. పన్నెండు మంది కొడుకులను ఆశీర్వదిస్తూ ప్రవచనాలు కూడా చెప్పాడు. పెద్ద కుమారుడికి వచ్చే రెండు వంతుల్ని 11వ కుమారుడు యోసేపుకు ఇచ్చాడు. అంటే ఆయన నుండి రెండు ఇశ్రాయేలు గోత్రాలు వస్తాయి. నాలుగవ కుమారుడు యూదా తన సహోదరులందరిలో ముందుకు వచ్చి మంచి పశ్చాత్తాపం ఉన్న హృదయాన్ని చూపించినందుకు ఆయనకు కూడా గొప్ప ఆశీర్వాదం దొరికింది. మెస్సీయ లేదా క్రీస్తు యూదా కుటుంబం నుండే వచ్చాడు.—ఆదికాండము 48, 49 అధ్యాయాలు.

యాకోబు 147 ఏళ్ల వయసులో చనిపోయాడు. అప్పుడు యోసేపు తనకున్న అధికారం ఉపయోగించి వాళ్ల మీద పగ తీర్చుకుంటాడని ఆయన అన్నలు భయపడ్డారు. కానీ యోసేపు వాళ్లకు ప్రేమతో అభయమిచ్చాడు. వాళ్లందరూ ఐగుప్తు రావడం వెనుక ఉన్నది యెహోవాయే కాబట్టి చేసినవాటిని బట్టి బాధపడాల్సిన అవసరం లేదని వాళ్లకు యోసేపు ముందునుండే నచ్చ చెప్తుతూ వచ్చాడు. అంతే కాకుండా "నేను దేవుని స్థానమందున్నానా?" అని కూడా వాళ్లతో అన్నాడు. (ఆదికాండము 15:13; 45:7, 8; 50:15-21) యెహోవాయే సరిగ్గా న్యాయం తీరుస్తాడని యోసేపుకు తెలుసు. అయినా, యెహోవా క్షమించిన వాళ్లను క్షమించక పోవడానికి యోసేపు ఎంతటి వాడు.—హెబ్రీయులు 10:30.

మీకు ఎవరినైనా క్షమించడం కష్టంగా ఉందా? అందులోనూ కావాలనే మనల్ని బాధపెట్టే వాళ్లను క్షమించడం చాలా కష్టంగా ఉంటుంది. కానీ నిజంగా పశ్చాత్తాపం చూపించిన వాళ్లను హృదయపూర్వకంగా క్షమించినప్పుడు మనం వాళ్ల గాయాలను మాన్పుతాం, మన సొంత గాయాలను కూడా మాన్పిన వాళ్లమౌతాం. అప్పుడు మనం యోసేపు విశ్వాసాన్ని, మన దయగల తండ్రి యెహోవా మాదిరిని అనుసరించిన వాళ్లమౌతాం. ■

(*w15*-E 05/01)



మీ పిల్లలకు దేవున్ని ప్రేమించడం నేర్పిస్తున్నారా?

## మీరు ఎప్పుడైనా ఆలోచించారా?

## తల్లిదండ్రులు పిల్లల్ని చక్కగా పెంచాలంటే ఏంచేయాలి?

పిల్లలు చక్కగా పెరగాలంటే ఇంట్లో తల్లిదండ్రులు ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకుంటూ, గౌరవించుకోవడం చాలా ముఖ్యం. (కొలొస్సయులు 3:14, 19) యెహోవా దేవుడు తన కుమారున్ని మెచ్చుకున్నాడు. మంచి తల్లిదండ్రులు కూడా పిల్లల్ని అలాగే ప్రేమిస్తారు, మెచ్చుకుంటారు.—**మత్తయి 3:17 చదవండి.**

తన సేవకులు చెప్పేవాటిని మన పరలోక తండ్రి వింటాడు, వాళ్ల భావాల్ని, ఆలోచనల్ని పట్టించుకుంటాడు. తల్లిదండ్రులు కూడా దేవునిలానే పిల్లలు చెప్పేవాటిని వినాలి. (యాకోబు 1:19) తల్లిదండ్రులు పిల్లల భావాలను అర్థం చేసుకోవాలి. పిల్లలు చెప్పేవి, చేసేవి కొన్నిసార్లు చిరాకు తెప్పించినా వాళ్లను అర్థం చేసుకోవాలి.—**సంఖ్యాకాండము 11:11, 15 చదవండి.**

## మీ పిల్లల్ని బాధ్యతగల వాళ్లుగా ఎలా పెంచవచ్చు?

ఏమి చేయాలి, ఏమి చేయకూడదో చెప్పే హక్కు తల్లిదండ్రులుగా మీకు ఉంది. (ఎఫెసీయులు 6:1) దేవుడు కూడా ఏమిచేయాలో, ఏమి చేయకూడదో చెబుతూ పిల్లలపై ప్రేమ చూపించాడు. మాట వినకపోతే ఏమి జరుగుతుందో కూడా వివరించాడు. మీరూ అలానే చేయండి. (ఆదికాండము 3:3) చెప్పిన మాట వినమని బలవంత పెట్టే బదులు, సరైనది చేస్తూ ఎలా సంతోషంగా ఉండవచ్చో దేవుడు నేర్పిస్తాడు.—**యెషయా 48:18, 19 చదవండి.**

మీ పిల్లలకు దేవున్ని ప్రేమించడం నేర్పించండి. దానివల్ల మీరు పక్కన లేనప్పుడు కూడా వాళ్లు చక్కగా నడుచుకుంటారు. దేవుడు అన్ని విషయాల్లో సరిగ్గా ఉంటూ మనకు నేర్పిస్తున్నాడు. **మీరూ** అలాగే అన్ని విషయాల్లో ఆదర్శంగా ఉంటూ మీ పిల్లలకు నేర్పించండి.—**ద్వితీయోపదేశకాండము 6:5-7; ఎఫెసీయులు 4:32; 5:1 చదవండి.** (*w15*-E 06/01)




ఇంకా తెలుసుకోవడానికి, యెహోవాసాక్షులు ప్రచురించిన ఈ పుస్తకంలో 14వ అధ్యాయం చూడండి

www.jw.org/te వెబ్‌సైట్‌లో కూడా ఈ పుస్తకం ఉంది

**దయచేసి నాకు *బైబిలు నిజంగా ఏమి బోధిస్తోంది?* పుస్తకం పంపించండి**

భాష ____________________

పేరు ____________________

అడ్రస్ ____________________

____________________

____________________

మా అడ్రస్ కోసం 2వ పేజీ చూడండి

ఇంటర్నెట్‌లో మరిన్ని ప్రశ్నలకు జవాబులు చదవండి

JW.ORG ™

ఈ పత్రికను, ముందు పత్రికలను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోండి

ఇంటర్నెట్‌లో 100 కన్నా ఎక్కువ భాషల్లో బైబిలు ఉంది

**www.jw.org/te** చూడండి లేదా ఈ కోడ్ స్కాన్ చేయండి

wp15 07/01-TU
150319